


# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 279 | వరంగల్ | సోమవారం, 10 ఆగస్టు 2026 | పేజీలు: 8


# వాడగూడెం ర్యాంపులో ఇష్టారాజ్యం



అదనపు వసూళ్లు చేస్తున్న ఇసుక ర్యాంప్ నిర్వాహకులు

## డీడీతో పనిలేదు.. ప్రత్యేక చార్జీలు చెల్లించాల్సిందే

- ఆన్‌లైన్ బుకింగ్.. బిల్లులు చెల్లించినా అదనపు వసూళ్లు
- లారీకి రూ.3 వేల నుంచి రూ.3,500.. డబ్బిస్తేనే లోడింగ్?
- ఓవర్‌లోడ్, నకిలీ వేబిల్లులు.. రాత్రివేళల్లోనూ రవాణా?
- టీజీఎండీసీకి ఫిర్యాదులు చేసినా స్పందన ఏది?
- నిబంధనలు కాగితాలకేనా.. అధికారుల పర్యవేక్షణ ఏమైంది?

ఇసుకను అక్రమంగా తరలించకుండా, నిర్ణీత ధరలకు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన విధానానికే తూట్లు పొడుస్తున్నారా..? ఆన్‌లైన్‌లో ఇసుక బుక్‌చేసి, నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించిన లారీ యజమానుల నుంచి మళ్లీ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారా..? ఓవర్‌లోడ్, నకిలీ వేబిల్లులు, రాత్రివేళల్లో రవాణా, నదీ గర్భంలో యథేచ్ఛగా తవ్వకాలు.. ఇలా ఇసుక ర్యాంపుల్లో సాధారణంగా వినిపించే అక్రమాల ఆరోపణలన్నీ ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెం ఇసుక ర్యాంపులోనూ వినిపిస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలకు తోడు, ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియో ఒకటి ఇటీవల వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడమే ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.

*- అక్షరశక్తి, నిఘా ప్రతినిధి*

6



ఇసుక ర్యాంప్ ఫైల్ ఫోటో

# మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడుతాం..

- సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్
- పాల్గొన్న హరీశ్‌రావు, తదితర నేతలు

ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పరిధి నల్లబెల్లిలో సోమవారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

*- అక్షరశక్తి, నర్సంపేట*

4






# టెండర్లు ఖరారు.. రద్దు!

- గిరిజన గురుకులాలకు ఆహారపదార్థాల సరఫరా, కేటరింగ్, స్వీపింగ్, శానిటేషన్ టెండర్లు
- 2026-27 ఏడాదికిగాను టెండర్లు వేసింది మెజార్టీగా గిరిజనులే..
- ఆర్సీవో ఆఫీస్‌లో జూలై ఒకటో తేదీన ఖరారు..
- రద్దు చేశామంటూ నెల తర్వాత సమాచారం
- గిరిజనులకు తీవ్ర అన్యాయం
- రద్దు చేయడంపై అనేక అనుమానాలు
- అనేక ఏళ్లుగా దందా చేస్తున్న వారికోసమేనంటూ ఆరోపణలు
- వివాదాస్పదంగా అధికారుల తీరు

5

# పేదల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణే రాష్ట్రప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి రూ.600 కోట్లు**
**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**అక్షరశక్తి,ఎల్కతుర్తి:** పేదల సంక్షేమం, రైతుల భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి అవసరమైన కార్యాలయ భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో మండలాలు ఉన్నా కార్యాలయ భవనాలు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి సుమారు రూ.600 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులు, భూ యజమానులకు భూములపై సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు పారదర్శకమైన విధానంలో భూభారతి ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి భూ పార్సిల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు భౌగోళిక కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్‌ను రూపొందించి అందించే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడతామని తెలిపారు. మండలానికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఆర్టీఓ కార్యాలయ భవన పనులను పూర్తిచేసేందుకు అవసరమైన అదనపు నిధులను కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఎల్కతుర్తి ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుని మండలాన్ని మరింత ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ రవి, ఎన్పి డిసిఎల్ ఎస్ ఈ సామ్య నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ ఏఆర్ఎస్ఐ గుండెపోటుతో మృతి



**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ కమిషరేట్ ఆర్మ్మర్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎస్. శామ్యూల్ (57) ఈ రోజు ఉదయం సమయంలో హనుమకొండలోని ప్రకాశ్ రెడ్డి పేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు. ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

## పేద పిల్లలకు నాణ్యమైన విద్యే లక్ష్యం







**అక్షరశక్తి,ఎల్కతుర్తి:** పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో రూ.3.25 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత వసతి పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ కేజీబీవీల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల తదితర వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డీఈఓ గిరిరాజ్ గౌడ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనితాదేవి తదితరులు పాల్గొన్నారు. మంత్రులు విద్యార్థినులకు బ్లాంకెట్లు, ట్రంక్ బాక్సులు, కార్పెట్లు అందజేసి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు.

## హర్ ఘర్ తిరంగాతో 'వికసిత్ భారత్' సంకల్పం

**అక్షరశక్తి,వరంగల్:** ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం శివనగర్ 34వ డివిజన్‌లోని తన నివాసంపై మాతృమూర్తితో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని 'వికసిత్ భారత్' నిర్మాణానికి తమ కట్టుబాటును చాటాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, డివిజన్, బూత్ పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు.

## కేయూలో 12, 13వ తేదీల్లో జాతీయ సదస్సు



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (TSPCB), స్టేట్ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (SEAC), ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్ సంయుక్త ఆధ్వర్యంలో "Synergizing Institutions for Sustainable Development: Strategic and Multi-Stakeholder Approach to Pollution Control" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఆగస్టు 12, 13 తేదీల్లో కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సు ఆహ్వాన పత్రికను సోమవారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యులు ఆచార్య గాదె దయాకర్, ఎన్ఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య పి.వి. రావుతో కలిసి ఆవిష్కరించారు. ఆగస్టు 12న సమావేశం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యులు ఆచార్య గాదె దయాకర్ అధ్యక్షతన జరుగుతుంది. ఆగస్టు 13న జరిగే కార్యక్రమం కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. సదస్సులో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ అనుమతులు, స్థిరమైన అభివృద్ధి తదితర సమకాలీన అంశాలపై నిపుణులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు చర్చించనున్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

**మంత్రి పొంగులేటి**

**అక్షరశక్తి,కమలాపూర్:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కమలాపూర్ మండలంలోని గూడూరు, మనేపల్లి తదితర గ్రామాల్లో 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఇప్పటివరకు సుమారు 8 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ఇళ్లను కేటాయిస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని విడతలవారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ 394 ఇళ్లకు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి

- **ఆగస్టు 15న ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి: తెలంగాణ రక్షణ సేన, ఉద్యమకారుల కమిటీ**





**అక్షరశక్తి,హనుమకొండ:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సహాయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాళోజి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఉద్యమకారుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం, ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బాషాబోయిన రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి, వాటి అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ అందించాలని, అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మరణించిన ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, భవిష్యత్తులో ఉద్యమకారులు అనుకోకుండా మరణిస్తే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరారు. ఉద్యమకారుల సమస్యలపై కేకే కమిటీ ఏర్పాటు చేసి వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాలు, విశ్వవిద్యాలయాలు, ప్రజా సంఘాలకు చెందిన ఉద్యమకారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం విచారకరమని వారు అన్నారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీర బిక్షపతి, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అనిల్ నాయక్, వరంగల్ ఈస్ట్ ఇన్‌చార్జి వెలిగేటి రవికుమార్, హనుమకొండ జిల్లా నాయకులు బండారి సుమన్ పటేల్, మానుపాటి రమేష్, నిశాంత్ రావు, అలుగోజు నాగరాజు, జివ్వాది రమేష్, బొచ్చు రాజు, జలుగూరి రమేష్, గుండ్రెడ్డి రోహిత్, జన్ను సంతోష్, జన్ను చిరంజీవి, దుప్పటి ప్రకాష్, పంజాల శ్రీరామ్, దండు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు జ్యోతి రెడ్డి, లలిత యాదవ్, ఆకుల విజయ, మంజుల రావు, లలిత కుమారి; విద్యార్థి నాయకులు సుతేజ్, భరత్, మహీధర్, గణేష్ పాల్గొన్నారు. ఉద్యమకారుల వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రభాకర్‌తో పాటు జేరిపోతుల రమేష్, ముక్కెర కుమారస్వామి, జంపాల సురేందర్, ఎల్తూరి సురేష్, బుర్ర రవీందర్ గౌడ్, కుక్కల జ్ఞానేశ్వర్, సంకెళ్ల రవీందర్, కాలే యాదగిరి, నర్ర సురేందర్, పోతురాజు ప్రభాకర్, పోతురాజు మల్లికార్జున్, కల్వచర్ల సుదర్శన్, గోలి విద్యాసాగర్ రెడ్డి, బిల్లా యాదగిరి, దంతాల రవి, రేణిగుంట్ల దుర్గా ప్రసాద్, కావేటి రవీందర్, తాళ్లపల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన భూములను కాపాడండి

- **తమ భూములు ఇప్పించాలని కలెక్టర్‌కు బాధితుల విన్నపం**




**అక్షరశక్తి, పరకాల :** తమ భూములను నకిలీ ధ్రువపత్రాలతో కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకున్నారని వాటిని రద్దుచేసి తమ భూములు తమకు ఇప్పించాలని భూబాధితులు జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం పరకాల ప్రెస్ క్లబ్ లో భూ బాధితులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరకాల శివారులోని సర్వే నంబర్ లో గల 682 ,683 ,698 ,195 ,637 ,639 ,640 ,648 ,750 ,751 ,752 ,,746 ,749 ,779 లలోని సొంత భూములను నకిలీ పత్రాలను సృష్టించి కొలగాని భాగ్యమ్మ వద్ద నుండి ఆముదాల రవి , పల్లెని వసంత ,బొద్దిరెడ్డి ప్రియదర్శిని , తక్కలపల్లి రంజిత్ రావ్ , ఎర్రబెల్లి గోపి , వేముల రాధమ్మ , చదువు రమణారెడ్డి , రాహుల్ లు స్థానిక తాసిల్దార్ తో కుమ్మక్కై పట్టా చేసుకున్నారని రామ్మెట్టి రాజేందర్ ఆరోపించారు. తన తల్లి పేరులో ఉన్న పట్టా భూమిలోని 22 గుంటలు ఉండగా అందులో నుండి 10 గుంటల భూమిని తన అనుమతి లేకుండా అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 25 ఎకరాల భూమిని పరకాల తహసిల్దార్ ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా పట్టా చేశారని వారు ఆరోపించారు. వాటి విలువ సుమారు బహిరంగ మార్కెట్లో 50 కోట్లుగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అట్టి భూములు తమ తాతైనా కోలగాని నాగయ్యకు చెందినదని రాశెట్టి రాజేందర్ తెలిపాడు.పరకాల శివారులోని భూపాలపల్లి కి వెళ్లే రోడ్డుకు సమీపంలో ఉంటాయని రాజేందర్ తెలిపాడు. కొలగాని నాగయ్యకు నలుగురు కూతుర్లు కాగా వారికి తనకు ఉండబడిన 50 ఎకరాల వ్యవసాయ భూమిని ఒక్కొక్కరికి సమానంగా పంచుతూ 1972లో నాగయ్య వీలునామా రాశాడు. కొలగాని నాగరాజు కొంతమంది దళారులతో కలిసి ఉండబడిన మొత్తం ఆస్తిని నకిలీ పత్రాలు సృష్టించి కాచేశాడని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇట్టి భూముల వ్యవహారం ఆ కుటుంబాల మధ్య గొడవలు జరిగి కోర్టును ఆశ్రయించారు. కోర్టు వ్యవహారాలలో ఉన్న భూములను తాసిల్దార్ ఆర్డీవో లు అక్రమంగా పట్టా చేయడం ఏమిటని ప్రశ్నించాడు. వ్యవస్థలోని పై స్థాయి అధికారుల సమయంతోనే ఈ వ్యవహారం అంతా సాగిందని బాధితులు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి పరకాల తాసిల్దార్ గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ నారాయణలపై సమగ్రమైన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని అదేవిధంగా అవినీతి ప్రక్రియలు భాగస్వాములై తమ భూములను పరాయి వ్యక్తుల పేరును బదిలాయించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**రిజిస్ట్రేషన్ ఉన్న బెదిరిస్తున్నారు.**

పరకాల శివారులోని 698లో గల సుమారు 15 గుంటల వ్యవసాయ భూమిని 2013లో కొని రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని బాధితుడు లక్కం సురేష్ అన్నాడు. తను పావుసెట్టి రాజధాని వ్యక్తి నుండి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పావుశెట్టి రాజు రామ్ శెట్టి రాజేందర్ వద్ద నుండి కొనుగోలు చేసి తనకి 2013లో అమ్మగా కొనడం జరిగిందని సురేష్ తెలిపారు. అదే సమయంలో వ్యవసాయ భూమిక కాకుండా వ్యవసాయ యాత్ర భూమిగా మార్చుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. సైతం వారు తనకు తెలియకుండా అక్రమంగా పట్టా చేసుకొని ఆక్రమించుకుంటున్నారని తన వద్ద అన్ని రకాల ఆధారాలు ఉన్నప్పటికీ అక్రమ పట్టాదారులు తనను చంపడానికి ప్రయత్నించారని ఆయన బోరుణ వినిపించాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన అన్నారు.

**తప్పుడు ఆధార్ కార్డుతో భూమిని కాల్ చేశారు.**

తప్పుడు ఆధార్ కార్డును సృష్టించి తన భూమిని కాజేశారని దానికి స్థానిక తహసిల్దార్ కారణమని న్యాయవాది పోరండ్ల రాజయ్య అన్నాడు. తను పట్టణంలోని ముస్లిం వద్ద గత 20 25 సంవత్సరాల క్రితం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తనకు భూమి అమ్మిన వ్యక్తి ఎప్పుడూ చనిపోయాడని అలాంటి వ్యక్తిపై కొత్తగా ఆధార్ కార్డును సృష్టించి తన భూమిని కాజేశారని రాజయ్య తెలిపారు. తన భూమికి సంబంధించిన అన్ని రకాల ఆధారాలు తన వద్ద ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయడం లేదని ఈ విషయమై తాసిల్దార్ని ఎన్నిసార్లు కలిసిన లాభం లేకుండా పోయిందన్నారు. తన స్థలంలో నిర్మాణం కోసం ఎన్నోసార్లు ప్రయత్నం చేసినట్లు తాజాగా తెలిపాడు. వ్యవహారంలో రెవెన్యూ అధికారులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన తెలిపాడు తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు అన్నారు.

# మెట్టుగుట్ట సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**అక్షరశక్తి, మడికొండ :** వరంగల్ మహా నగరంలోని మడికొండలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన మెట్టుగుట్టపై గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారిని వరంగల్ మహానగరపాలక సంస్థ కమిషనర్ వెంకన్న దర్శించి, అభిషేకం చేశారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక అర్చనలు చేపట్టారు. తదుపరి అర్చక స్వాములు వేద ఆశీర్వచనం చేసినారు. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, శివాలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ రఘు చందర్ ఆధ్వర్యంలో అర్చకులు అభిలాష్ శర్మ, విష్ణు వర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మచే నిర్వహించగా, ధర్మకర్తలు భోగి కేదారి, బైరి రాజు, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారులకు ఎమ్మెల్యే భరోసా...



**అక్షరశక్తి, హన్మకొండ :** తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. సోమవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉంటుందని, ఆ చిన్నారుల ప్రాణాలను కాపాడటానికి రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో అనేక సార్లు రక్తదాన శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఇవి శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

**అక్షరశక్తి,హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆగస్టు 11, 12 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే పోటీలను సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ రేపు ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారు. ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి, టీమ్ స్పిరిట్, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడమే లక్ష్యమని యాజమాన్యం తెలిపింది.



# నర్సంపేటలో బీఆర్ఎస్ నేతల నిరసన

**పెద్ది విగ్రహావిష్కరణ గద్దె కూల్చివేయడంపై మండిపాటు**





**అక్షరశక్తి, నర్సంపేట :** నర్సంపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన గద్దె కూల్చివేయడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో పట్టణ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు కూల్చివేయడం సరికాదన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ గద్దె కూల్చివేయడం దుర్మార్గమని మండిడ్డారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఈ కుట్ర వెనక కాంగ్రెస్ నాయకులు ఉన్నారని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కచ్చితంగా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఆవిష్కరించి తీరుతామని అన్నారు. ఈ కుట్రలు చూస్తుంటే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంపై కూడా తమకు అనుమానాలు వస్తున్నాయని, పెద్దిని మానసికంగా ఎంత ఇబ్బంది పెట్టారో అర్థం ఆవుతుందని ఆరోపిపంచారు. 2 రోజుల సమయం ఇస్తున్నామని, ఆలోపు ఈ విగ్రహ గద్దెను కూల్చిన వారిని శిక్షించకపోతో రాష్ట్రవ్యాప్తంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామ గ్రామన పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

# సేవా రత్న నేషనల్ అవార్డుకు ఎంపికైన ఎలగొండ రాజయ్య




**అక్షరశక్తి, వరంగల్ :** సేవా రత్ననేషనల్ అవార్డు 2026 కు ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ ఉద్యమకారుడు, సంఘ సేవకులు వరంగల్ జిల్లా గొర్రెకుంట గ్రామానికి చెందిన ఎలగొండ రాజయ్య ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ వారు ప్రకటించారు. అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ... ఎలగొండ రాజయ్య పేద ప్రజలకు చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను, పేద విద్యార్థులకు తన వంతుగా ఆర్థికంగా సాయం చేస్తున్న సేవా గుణాన్ని పరిగణలోకి తీసుకొని అవార్డును ప్రకటించామన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 16వ తేదీన హైదరాబాద్లో నిర్వహించే బహుజన సాహిత్య ఆకాడమి తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్ సందర్భంగ ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి సుమారుగా 300మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్సికి హాజరవుతారని తెలియజేశారు. ఈ ఆవార్డ్ లెటర్ అందజేసిన వారిలో... నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యులు టేక్ రాజశేఖర్, కనుకుంట్ల విజయ్ కుమార్ అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్ బిచ్చగారీ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

- రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో
- వరంగల్‌లో స్తంభించిన ట్రాఫిక్
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు





**అక్షరశక్తి, వరంగల్:** స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు, లేబర్ కోడ్స్ లాంటి వినాశనకర విధానాలతో రైతులను కార్మికులను అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి సుధమల్ల భాస్కర్ వల్లందాస్ కుమార్, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి పాశం రవి, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐసీసీటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి హెచ్చరించారు. సోమవారం నాడు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకొని రాస్తారోకో చేస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆందోళనను విరమింప చేశారు.

ఈ సందర్భంగా ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు కార్మిక సంఘాల బాధ్యుడు గంగుల దయాకర్ అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదం పేరు చెప్పి ఆచరణలో అమెరికా లాంటి విదేశాలకు అనుకూలంగా విధానాల రూపకల్పన చేసి స్వదేశీ వ్యవసాయాన్ని రైతులను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా కార్మికులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా 32 దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకొని అక్కడి ఉత్పత్తులను మన దేశంలోకి అనుమతించడం దారుణం అన్నారు. అమెరికా లాంటి దేశంలో రైతులకు అనేక సబ్సిడీలు రాయితీలు అందించి ప్రోత్సహిస్తుంటే మనదేశంలో మాత్రం అందు విరుద్ధంగా ఉందన్నారు ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య నర్ర ప్రతాప్ నెట్టెం నారాయణ చుంచు జగదీశ్వర్ మాలోతు సాగర్ పుల్ల రమేష్ ఓదెల రాజన్న బండి వెంకటేశ్వర్లు హంసల్ రెడ్డి బొల్లు ఎల్లయ్య ఎంఏ పాషా చుక్క శోభ పూలక్కా పిడి ఎస్ యు పృధ్వి నర్సింగం బాబు రామస్వామి చిన్న రాజేందర్ ఐలయ్య ఎగ్గని మల్లికార్జున్ మాలి ప్రభాకర్ గణిపాక ఓదేలు అప్పనపుడి నరసయ్య నలివెల రవి సుమంత్ చారిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడుతాం..

- సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్
- పాల్గొన్న హరీశ్‌రావు, తదితర నేతలు







**అక్షరశక్తి, నర్సంపేట :** ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పరిధి నల్లబెల్లిలో సోమవారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారని, లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారని అన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.

సంతాప సభలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. మొన్న పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో పడితే నేను, కేటీఆర్ ఆగమేఘాల మీద పరుగెత్తుకుంటూ వచ్చాం. వచ్చే సరికి ఆస్పత్రి చూస్తే నాకొక పాత జ్ఞాపకం గుర్తొచ్చింది. ఒక ఉద్యమకారుడు తెలంగాణలో ఆత్మహత్య చేసుకుంటే డీసీఎంపై ఆ అమరుడి అంతిమయాత్ర జరుగుతుంది. ఆ అంతిమ యాత్ర జరుగుతుంటే వరంగల్‌లోని అమరవీరులస్థూపం వద్ద పోలీసులకు, మనకు మధ్య బాగా ఘర్షణ అయింది. ఆ ఘర్షణలో నేను డీసీఎంపై నుంచి కిందపడ్డానన్నారు. డీసీఎంపై నుంచి కిందపడ్డప్పుడు నన్ను పట్టుకున్నది పెద్ది సుదర్శన్ రెడ్డి. నేను భూమి మీద పడాలి. కానీ నేను ఆయన చేతుల పడి కిందపడ్డా ఆరోజు. వెంటనే సుదర్శన్ రెడ్డి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిండు. ఆ రోజు ఏ ఆస్పత్రికైతే సుదర్శన్ రెడ్డి నన్ను తీసుకపోయిండో.. పాపం ఆ ఆస్పత్రిలో సుదర్శన్‌రెడ్డిని చివరి చూపు కూడా చూస్తానని కలలు కూడా కనలేదు. అప్పుడు నాకు దెబ్బతాకితే ఆగమేఘాల మీద సుదర్శన్ రెడ్డి నన్ను ఆ ఆస్పత్రికి తీసుకపోయిండు. పాపం సుదర్శన్ రెడ్డి చివరి దశలో ఆ ఆస్పత్రిలో ఉన్నడని కన్నీంటి పర్యంతమయ్యారు.

# టెండర్లు ఖరారు.. రద్దు!

- గిరిజన గురుకులాలకు ఆహారపదార్థాల సరఫరా, కేటరింగ్, స్వీపింగ్, శానిటేషన్ టెండర్లు
- 2026-27 ఏడాదికిగాను టెండర్లు వేసింది మెజార్టీగా గిరిజనులే..
- ఆర్సీవో ఆఫీస్‌లో జూలై ఒకటో తేదీన ఖారారు..
- రద్దు చేశామంటూ నెల తర్వాత సమాచారం
- గిరిజనులకు తీవ్ర అన్యాయం
- రద్దు చేయడంపై అనేక అనుమానాలు
- అనేక ఏళ్లుగా దందా చేస్తున్న వారికోసమేనంటూ ఆరోపణలు
- వివాదాస్పదంగా అధికారుల తీరు




**అక్షరశక్తి, వరంగల్:** ఏటూరునాగారం ఐ.టి.డి.ఏ పరిధిలో 2026 27 విద్యా సంవత్సరానికి గాను ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు ఆహార పదార్థాలు ( పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్) సరఫరా చేయడానికి, కేటరింగ్, స్వీపింగ్, శానిటేషన్‌కు సంబంధించిన టెండర్లు అనూహ్యంగా రద్దు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు ఖరారు చేసి, టెండరుదారులకు గురుకుల పాఠశాలలు కేటాయించిన అనంతరం ఒక్కసారిగా టెండర్లు రద్దు చేశామంటూ సమాచారం ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అధికారుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నియమనిబంధనలకు అనుగుణంగా టెండర్లు వేశామని, తమను ఎంపిక చేశారని, తీరా.. ఇప్పుడు టెండర్లు రద్దు చేశామని చెప్పడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**9 గురుకులాలకు టెండర్లు..**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు TGTWURJC (G) Hanamkonda, COE Warangal, TGTWRCOE Yakubpura, TGTWURJC (G) Parvathagiri, TGTWURJC (B) Narsampet, TGTWRJC (G) MC Pally, Sainik School Ashoknagar, TGTWURJC (G) Palakurthy, TGTWRDC (W) Janagaonతోపాటు తదితర గురుకులాలకు సంబంధించి జూన్ 18న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. టెండర్ దరఖాస్తులు 19.06.2026 నుండి 30.06.2026కు స్వీకరించారు. హన్మకొండలోని ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్సీవో) కారాలయంలో జూలై 1వ తేదీన జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో టెండర్లు తెరిచి ఖరారు చేశారు. నియమ నిబంధనలకు లోబడి టెండర్ వేసిన వారికి గురుకులాలు కూడా కేటాయించారు. తీరా.. నెల రోజుల తర్వాత ఇప్పుడు మీ దగ్గర తగిన పత్రాలు పాన్ నంబర్, జీఎస్టీ నంబర్, ఫుడ్ సేఫ్టీ, లేబర్ లైసెన్స్ లేవు.. రెండర్లు రద్దు అయ్యాయి.. అంటూ అధికారులు సమాచారం ఇస్తున్నారని గిరిజన టెండర్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఈసారి గిరిజనులే అధికం...**

గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు ఆహారపదార్థాలు (పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్) సరఫరా చేయడానికి, కేటరింగ్, స్వీపింగ్, శానిటేషన్‌కు సంబంధించిన టెండర్లు ఈసారి మెజార్టీగా గిరిజనులే దాఖలు చేశారు. నియమనిబంధనల ప్రకారం.. మొదటి ప్రాధాన్యత గిరిజనులకు, ఆ తర్వాత గిరిజనేతరులకు ఇవ్వాల్సి ఉంటుంది. గిరిజనులు టెండర్లు దాఖలు చేయనిపక్షంలోనే ఇతరులకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో గిరిజనులకు అవగాహన లేకపోవడంతో మెజార్టీగా గిరిజనేతరులే టెండర్లు వేసి, దక్కించుకున్నారు. వారే ప్రస్తుతం ఆహారపదార్థాలు ( పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్) సరఫరా చేయడానికి, కేటరింగ్, స్వీపింగ్, శానిటేషన్‌కు సంబంధించిన కాంట్రాక్టులు చేస్తున్నారు. అయితే.. ఈసారి 202627 ఏడాదికి సంబంధించి నిర్వహించిన టెండర్లు మెజార్టీగా గిరిజనులే దాఖలు చేశారు. జూలై ఒకటో తేదీన టెండర్లు కూడా ఖరారు చేశారు. సుమారు నెల రోజుల తర్వాత టెండర్లు రద్దు అయ్యాయి అంటూ.. ఆర్సీవో చెబుతున్నారని టెండర్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టెండర్ల రద్దుపై అనేక అనుమానాలు..**

టెండర్లు రద్దు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న గిరిజనేతర టెండర్‌దారులను కొనసాగించేందుకే ఈ టెండర్లను రద్దు చేశారని, ఈసారి గిరిజనులే మెజార్టీగా టెండర్లు వేయడంతో అడ్డుకునేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే పాన్ నంబర్, జీఎస్టీ నంబర్, ఫుడ్ సేఫ్టీ, లేబర్ లైసెన్స్ లేవనే అంశాన్ని ముందుకు తీసుకొస్తున్నారని, గతంలో ఉన్న టెండర్‌దారులకు కూడా ఆ పత్రాలు లేవని, మరి వారిని ఎలా కొనసాగిస్తున్నారని ప్రస్తుతం టెండర్లు వేసిన గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన గురుకుల విద్యాలయాల టెండర్లలో అనేక ఏళ్లుగా కొందరు గిరిజనేతరులు దందా చేస్తున్నారని, వారికి అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈసారి టెండర్లు ఆ గిరిజనేతరులకు దక్కకపోవడంతో కావాలనే టెండర్లు రద్దు చేసి, మళ్లీ వారినే కొనసాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

## మేడారం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**అక్షరశక్తి, ములుగు:** మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ నెల 16న చేపట్టనున్న పర్యటన ఏర్పాట్లను, ఆలయ అభివృద్ధి పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా నూతన క్యూ లైన్ ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## తలసేమియా, సికిల్ సెల్ చిన్నారులకు పెన్షన్..

**అక్షరశక్తి,హనుమకొండ:** తలసేమియా, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆగస్టు 15 నుంచి పెన్షన్ సౌకర్యం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ ఆధ్వర్యంలో సోమవారం కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, తలసేమియా-సికిల్ సెల్ బాధితుల పెన్షన్ రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.




తలసేమియా కేవలం చిన్నారి ఆరోగ్య సమస్య కాదని, కుటుంబంపై ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతుందని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ ఒక చిన్నారికి అండగా, కుటుంబానికి భరోసాగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణను తలసేమియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, రెడ్‌క్రాస్, వైద్యులు, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు, యువత సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తలసేమియా చిన్నారులకు నిరంతరం రక్తం అందేలా యువత పెద్ద సంఖ్యలో రక్తదానం చేయాలని కోరారు. హనుమకొండ రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను మంత్రి అభినందించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్‌క్రాస్ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాను రాసిన తొలి లేఖ తలసేమియా, సికిల్ సెల్ చిన్నారులకు పెన్షన్ కల్పించాలనే అంశంపైనే అని తెలిపారు. పెన్షన్ ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు చిన్నారులకు పండ్లు పంపిణీ చేయగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెడ్‌క్రాస్ పాలకవర్గం శాలువా, షీల్డ్‌తో సత్కరించింది. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, GWMC కమిషనర్ టి. వెంకన్న, ఇతర అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**అక్షరశక్తి,హనుమకొండ:** భీమారం సమీపంలోని జగతి గార్డెన్స్‌లో శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. హనుమకొండ జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో 170 జంటలు పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య కళ్యాణ తంతు వైభవంగా నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం మహా సుదర్శన యాగం నిర్వహించారు. హనుమకొండ జిల్లా శాఖ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అభినందించారు. జిల్లా శాఖకు రూ.25 వేల విరాళం ప్రకటించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# వాడగూడెం ర్యాంపులో ఇష్టారాజ్యం


ఇసుక ర్యాంప్ ఫైల్ ఫోటో

- డీడీతో పనిలేదు.. ప్రత్యేక చార్జీలు చెల్లించాల్సిందే
- ఆన్‌లైన్ బుకింగ్.. బిల్లులు చెల్లించినా అదనపు వసూళ్లు
- లారీకి రూ.3 వేల నుంచి రూ.3,500.. డబ్బిస్తేనే లోడింగ్?
- ఓవర్‌లోడ్, నకిలీ వేబిల్లులు.. రాత్రివేళల్లోనూ రవాణా?
- టీజీఎండీసీకి ఫిర్యాదులు చేసినా స్పందన ఏదీ?
- నిబంధనలు కాగితాలకేనా.. అధికారుల పర్యవేక్షణ ఏమైంది?

**అక్షరశక్తి, నిఘా ప్రతినిధి:** ఇసుకను అక్రమంగా తరలించకుండా, నిర్ణీత ధరలకు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన విధానానికే తూట్లు పొడుస్తున్నారా..? ఆన్‌లైన్‌లో ఇసుక బుక్‌చేసి, నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించిన లారీ యజమానుల నుంచి మళ్లీ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారా..? ఓవర్‌లోడ్, నకిలీ వేబిల్లులు, రాత్రివేళల్లో రవాణా, నదీ గర్భంలో యథేచ్ఛగా తవ్వకాలు.. ఇలా ఇసుక ర్యాంపుల్లో సాధారణంగా వినిపించే అక్రమాల ఆరోపణలన్నీ ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెం ఇసుక ర్యాంపులోనూ వినిపిస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలకు తోడు, ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియో ఒకటి ఇటీవల వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడమే ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.

**ఆన్‌లైన్ బుకింగ్.. ఆపై అదనపు బాదుడు**

ప్రభుత్వ విధానం ప్రకారం ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని, నిర్ణీత మొత్తాన్ని చెల్లించిన అనంతరం రవాణా చేయాలి. ఇసుక కొనుగోలుదారుడికి రవాణా కోసం రవాణా పాస్ లేదా వేబిల్ జారీ చేయాలి. వాహన సామర్థ్యానికి అనుగుణంగానే ఇసుక లోడింగ్ చేయాలి. ప్రభుత్వ నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నా వాడగూడెం ర్యాంపులో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని, బిల్లులు చెల్లించిన తర్వాత కూడా లారీ లోడింగ్ కోసం అదనంగా రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు చెల్లించాల్సి వస్తోందని లారీ అసోసియేషన్లు ఆరోపిస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే లోడింగ్ ఆలస్యం చేస్తూ రోజుల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని వాపోతున్నాయి.

**ఓవర్‌లోడ్‌కు అడ్డెవరు?**

ఇసుక ర్యాంపుల్లో అక్రమాలకు ప్రధాన కారణంగా మారుతున్న ఓవర్‌లోడ్ ఆరోపణలు వాడగూడెంలోనూ వినిపిస్తున్నాయి. వాహన ఆర్సీలో ఉన్న అనుమతించిన సామర్థ్యం మేరకే లోడింగ్ చేయాల్సి ఉంటుంది.


అదనపు వసూళ్లు చేస్తున్న ఇసుక ర్యాంప్ నిర్వాహకులు

టీజీఎండీసీ కూడా వాహన పాసింగ్ సామర్థ్యానికి అనుగుణంగానే లోడింగ్ చేయాలని స్పష్టం చేస్తోంది. అయినా ఎక్కువ ఇసుకను తరలిస్తే ఎక్కువ లాభం వస్తుందన్న ఉద్దేశంతో సామర్థ్యానికి మించి లోడింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఏర్పడుతోంది. వాడగూడెం ర్యాంపు పరిధిలో నకిలీ వేబిల్లుల సాయంతో రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇసుక రవాణాకు చెల్లుబాటు అయ్యే రవాణా పాస్ తప్పనిసరి. అందులో వాహనం, పరిమాణం, గమ్యస్థానం వంటి వివరాలు ఉండాలి. రవాణాను ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ, డాక్యుమెంటేషన్ ద్వారా పర్యవేక్షించాలన్నది నిబంధన. అయినా రాత్రివేళల్లో అక్రమ రవాణా జరుగుతోందంటే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ర్యాంపులోకి ఎన్ని లారీలు వచ్చాయి..? ఎన్ని లోడ్లు వెళ్లాయి..? ఏ వాహనానికి ఎంత ఇసుక కేటాయించారు..? వేబిల్‌లో ఉన్న పరిమాణమే లోడ్ చేశారా..? అన్నది పరిశీలిస్తే అసలు వ్యవహారం బయటపడే అవకాశం ఉంది.

**ఫిర్యాదులపై టీజీఎండీసీ మౌనం ఎందుకు?**

వాడగూడెం ర్యాంపులో అదనపు వసూళ్లపై వీడియో బయటకు వచ్చినా, లారీ యజమానులు, స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కనిపించకపోవడంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ర్యాంపుల నిర్వహణ, ఇసుక తవ్వకాలు, లోడింగ్, రవాణాపై పర్యవేక్షణ బాధ్యత ఉన్న టీజీఎండీసీ అధికారులు అసలు ఏం తనిఖీలు చేస్తున్నారు? ఫిర్యాదులు అందితే ర్యాంపులోని రికార్డులు, సీసీ కెమెరా దృశ్యాలు, వేబిల్లులు, లారీ లోడింగ్ వివరాలను పరిశీలించారా? అదనపు వసూళ్ల ఆరోపణలు నిజమైతే బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఇసుక విధాన ప్రధాన లక్ష్యాల్లోనే అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, ఓవర్‌లోడింగ్‌ను నియంత్రించడం, పారదర్శకతతో ఆన్‌లైన్ ఇసుక విక్రయాలు నిర్వహించడం ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఇసుకను ఎలక్ట్రానిక్ పర్యవేక్షణలో వెలికితీసి, స్టాక్‌యార్డుకు తరలించే ముందు తూకం లేదా పరిమాణ నిర్ధారణ చేయాలి. కొనుగోలుదారు నిర్ణీత ధర చెల్లించి రవాణా పాస్ పొందాలి. స్టాక్‌యార్డు నుంచి వాహనం ఆమోదిత సామర్థ్యం మేరకే లోడింగ్ చేయాలి.

**నిబంధనల అమలు ఎందుకు లేదు?**

ప్రభుత్వమే ఇసుక ర్యాంపుల్లో అక్రమాలను అరికట్టడం, ఓవర్‌లోడింగ్‌ను నియంత్రించడం, పారదర్శకత పెంచడం తమ విధాన లక్ష్యాలని చెబుతోంది. మరి వాడగూడెంలో అదనపు వసూళ్లు, ఓవర్‌లోడ్, నకిలీ వేబిల్లులు, అక్రమ రవాణా ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి? ర్యాంపులో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎలా ఉంది? రోజువారీగా లోడింగ్, వేబిల్, లారీ వివరాలను ఎవరు తనిఖీ చేస్తున్నారు? ప్రభుత్వ ధరకు మించి ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయకూడదనే నిబంధనకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ఎలాంటి విచారణ జరిగింది? అసలు టీజీఎండీసీ అధికారులకు ఫిర్యాదులు అందినా ఎందుకు పట్టించుకోవడం లేదు? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరిపి ర్యాంపు రికార్డులు, సీసీ కెమెరా దృశ్యాలు, ఆన్‌లైన్ బుకింగ్ వివరాలు, వేబిల్లులు, వాహనాల బరువులను బహిర్గతం చేస్తేనే వాడగూడెం ర్యాంపులో జరుగుతున్నదేమిటో ప్రజలకు స్పష్టమవుతుంది. లేకపోతే నిబంధనలు కాగితాలకే పరిమితమై.. ర్యాంపులో మాత్రం ఇసుకతో పాటు అక్రమాలూ యథేచ్ఛగా ప్రవహిస్తున్నాయనే విమర్శలకు అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

**అక్రమాలకు టీజీఏండీసీ వత్తాసు...**
మరో కథనంలో...

# విద్యార్థిలోకం సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

**పీడీఎస్‌యూ నేతలు పృథ్వీ, అనిల్**




**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** విద్య రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థులంతా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబోలా అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో "విద్యారంగంలో వస్తున్న మార్పులు సమస్యలు పరిష్కార మార్గాలపై "రాష్ట్రస్థాయి చర్చ గోష్టి సమావేశాలు" రెండు రోజులపాటు కొనసాగి నేడు ముగిశాయి. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబోలా అనిల్ లు మాట్లాడుతూ ప్రభుత్వాలకు పేద విద్యార్థుల చదువుల పట్ల, వారి భవిష్యత్ అభివృద్ధి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశంలో పేపర్ లీకేజీ, ప్రైవేట్ విద్యా సంస్థల అధిక ఫీజులను, నిరుద్యోగ సమస్యను అరికట్టడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం వలన తెలంగాణ రాష్ట్రంలో 9500 కోట్ల రూపాయల స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు నేటికీ విడుదలకు నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 15% నిధులు కేటాయిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాని, రాష్ట్రానికి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనలు విరమించుకోవాలని, రాష్ట్రంలోని ఒక్కొక్క యూనివర్సిటీకి 1000 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్ ,నాన్ టీచింగ్ పోస్టులను రెగ్యులర్ ప్రతిపాదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఢిల్లీలో జెన్‌జీ విద్యార్థులు నిర్వహించిన పోరాట తరహాలో తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, బి. నరేందర్, ఎస్.రాకేష్, దీక్షిత, సహాయ కార్యదర్శులు డి.సురేష్, బుర్రా వీరభద్రం, బోయినపల్లి అజయ్, రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్, రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ పి. అనూష, రాష్ట్ర నాయకులు సీతారాం, మారుతి, నాగరాజు, దండు వినయ్, వెంకటేష్, మహేష్, కిరణ్, శ్రావణ్, హరీష్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# జ్ఞానానికి వినయాన్ని జోడించిన మహనీయుడు ఆచార్య లక్ష్మణ మూర్తి



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

కొంతమంది ఉపాధ్యాయులు పాఠాలు చెబుతారు. కొంతమంది పండితులు విషయాలను వివరిస్తారు. మరికొందరు వక్తలుగా సభలను ఆకట్టుకుంటారు. కానీ ఈ మూడు లక్షణాలను మించి, తాను స్పృశించిన ప్రతి విషయానికీ ఒక కొత్త ఆలోచనా ద్వారం తెరిచి, తనను కలిసిన ప్రతి మనిషిలో జిజ్ఞాసను మేల్కొలిపే మహనీయులు చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తారు. ఆ అరుదైన మేధావులలో ఆచార్య ఎస్. లక్ష్మణ మూర్తి గారు ఒకరు.

కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్‌లో ఆంగ్ల విభాగంలో సుదీర్ఘకాలం ఆచార్యునిగా సేవలందించిన ఆయన ఒక అధ్యాపకుడిగా మాత్రమే కాదు...ఒక జ్ఞానసంప్రదాయంగా నిలిచారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషలపై ఆయనకున్న అసాధారణ పాండిత్యం భారతీయ జ్ఞానపారంపర్యాన్నీ, పాశ్చాత్య సాహిత్య చింతననూ ఒకే వేదికపైకి తీసుకురాగలిగింది. ఉపనిషత్తుల తాత్త్విక గాంభీర్యం నుంచి ఆధునిక పాశ్చాత్య సాహిత్య విమర్శ వరకు ఆయన చూపు సమానమైన లోతును, విశాలతను ప్రదర్శించేది. విలియం సరోయన్ రచనలపై పరిశోధన చేసి పీహెచ్.డి. పొందడం, ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ ద్వారా అమెరికాలో ఉన్నత అధ్యయనం చేయడం ఆయన విద్యాసాధనకు నిదర్శనాలు.

అయితే ఆయనను కేవలం డిగ్రీలు, హోదాలు, పురస్కారాలతో అంచనా వేయడం ఆయన వ్యక్తిత్వానికి న్యాయం చేయదు. ఆయన అసలు గొప్పదనం ఆయన ఆలోచనా విధానంలో ఉంది. ఏ విషయంపై మాట్లాడినా, సాధారణంగా అందరూ చూసే ఉపరితలాన్ని దాటి, అంతర్లీనంగా ఉన్న మరో కోణాన్ని ఆయన ఆవిష్కరించేవారు. ఒక సాధారణమైన విషయాన్ని కూడా అసాధారణమైన ప్రశ్నగా మార్చగలిగే మేధాశక్తి ఆయనది. అందుకే ఆయన ఉపన్యాసం విన్నవారు కేవలం ఒక విషయం తెలుసుకుని బయటకు వచ్చేవారు కాదు; ఆ విషయం గురించి మరింతగా ఆలోచించాలనే తపనతో బయటకు వచ్చేవారు.

ఆయన బోధనలో జ్ఞానం మాత్రమే ఉండేది కాదు...ఆ జ్ఞానానికి జీవం పోసే వినోదం కూడా ఉండేది. వ్యంగ్యాన్ని, హాస్యాన్ని, చలోక్తిని ఎంత సున్నితంగా ఉపయోగించాలో ఆయనకు బాగా తెలుసు. ఎవరి మనసునూ గాయపరచకుండా ఒక లోతైన సత్యాన్ని నవ్వుతూ చెప్పగలిగిన అరుదైన వక్త ఆయన. అనేక భాషలలోని ప్రసిద్ధ సూక్తులు,



ప్రొఫెసర్. ఎస్. లక్ష్మణమూర్తి గారు.

సాహిత్య పంక్తులు, తాత్త్విక భావాలను సందర్భానుసారంగా అలవోకగా ప్రస్తావిస్తూ, సంక్లిష్టమైన విషయాలను కూడా సాధారణ శ్రోతకు అర్థమయ్యేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. మాటల్లో ఆయనకు అపారమైన పొదుపు. తక్కువ సమయంలో ఎక్కువ భావాన్ని అందించడం ఆయన వాక్చాతుర్యానికి ప్రత్యేకమైన ముద్ర.

అంతటి పాండిత్యం ఉన్నప్పటికీ ఆయనలో అహంకారానికి స్థానం లేకపోవడం మరింత ఆశ్చర్యకరం. కొత్తగా పరిచయమైన వారినీ సైతం ఆప్యాయంగా పలకరించడం, వర్ధమాన కవులు,రచయితలు,పండితులతో సమానమైన దృష్టితో మానవీయతతో మెలగడం ఆయన సహజ స్వభావం. తనను ఆశ్రయించి వచ్చినవారిని వారి స్థాయి, వయస్సు, హోదాలతో కొలవకుండా వారి ఆలోచనను గౌరవించేవారు.ఎవరైనా ఒకరు తమ రచనపై అభిప్రాయం చెప్పమని, ఒక ఆశీపూర్వక "ముందు మాట" రాయమని కోరితే, తనకు సమయం తక్కువగా ఉన్నా, ఆరోగ్యం సహకరించకపోయినా, ఆ రచనను శ్రద్ధగా చదివి తన అభిప్రాయాన్ని చెప్పడం ఆయనలోని గురుత్వానికి నిదర్శనం. తప్పులను చూపడమే కాదు, రచనలోని మంచిని గుర్తించి ప్రశంసించడం, మరింత మెరుగ్గా రాయడానికి ప్రోత్సహించడం ఆయనకు సహజమైన అలవాటు.

అందుకే ఆయనకు శిష్యులు కేవలం తరగతి గదిలోని విద్యార్థులు కాదు. వారిలో భవిష్యత్తును చూడగలిగిన గురువు ఆయన. ఒక విద్యార్థిలోని చిన్న ప్రతిభను గుర్తించి దానిని పెంచడం, ఒక యువ రచయితలోని ధైర్యాన్ని ప్రోత్సహించడం, ఒక కొత్త ఆలోచనకు విలువ ఇవ్వడం... ఇవి ఆయన విద్యాదర్శనంలోని ముఖ్యమైన లక్షణాలు. ఉపాధ్యాయుడి పని పాఠ్యాంశాన్ని పూర్తి చేయడం కాదు; విద్యార్థిలో ప్రశ్నించే మనస్సును సృష్టించడమే అన్న భావనకు ఆయన జీవితం ఒక ఉదాహరణ.

ఆయన సాహిత్య సృష్టిలో కూడా ఇదే విశాలమైన దృష్టి కనిపిస్తుంది. ముఖ్యంగా గోపికా వల్లభ కేవలం భక్తి కవిత్వంగా చదివి పక్కన పెట్టదగిన రచన కాదు. అందులో భక్తి, జ్ఞానం, సామాజిక చైతన్యం, ఆధ్యాత్మిక విముక్తి పరస్పరం విడదీయలేని నాలుగు ప్రవాహాలుగా కలుస్తాయి.

ఆయన కవిత్వంలో భక్తి అనేది కేవలం దేవుని స్తుతించడం మాత్రమే కాదు. మనిషిని అంతర్గతంగా మార్చే సాధన. సేవ అంటే కేవలం దేవాలయ సేవ మాత్రమే కాదు. సమాజానికి, జీవులకు, మానవత్వానికి ఉపయోగపడే జీవన విధానం. జ్ఞానం అహంకారానికి అలంకారం కాదు. సేవకు సాధనం. ఈ భావన ఆయన ఆధ్యాత్మిక దృష్టిలోని మానవీయతను తెలియజేస్తుంది.

ఆయన కవిత్వంలోని మరో విశిష్టత... భౌతిక సంపదపై విమర్శ. మనిషి ఎంత సంపాదించినా, ఎంత భోగ భాగ్యాలతో తులతూగినా, అంతరంగంలోని శూన్యత తొలగకపోతే నిజమైన సంతృప్తి రాదనే తాత్త్విక సందేశం ఆయన పద్యాలలో కనిపిస్తుంది. కాలం ముందు సంపద, అధికారం, అహంకారం అన్నీ క్షణికమైనవే. మనిషి తనను తాను అధిగమించి ఒక విశాలమైన చైతన్యంతో అనుసంధానమైనప్పుడే జీవితం అర్థవంతమవుతుందనే ఆలోచన ఆయన సాహిత్యంలో పునరావృతమవుతుంది.

అదే సమయంలో ఆయన ఆధ్యాత్మికత లోకవిముఖమైనది కాదు. ఆధునిక సమాజంలోని స్వార్థం, వినియోగవాదం, అసూయ, ద్వేషం, విలువల క్షీణత వంటి సమస్యలను ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలించడం ఆయన రచనల ప్రత్యేకత. “ఈశావాస్య” భావనను ఆధారంగా చేసుకుని ప్రపంచాన్ని మనిషి స్వంత ఆస్తిగా కాకుండా ఒక బాధ్యతగా చూడాలనే దృష్టి ఆయన కవిత్వంలో వ్యక్తమవుతుంది.

ఆయన భక్తి కవిత్వంలో ప్రకృతి, రైతు, శ్రమ, సమాజం వంటి అంశాలకు కూడా స్థానం కల్పించడం విశేషం. వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక పవిత్రమైన కృషియోగంగా చూడగల దృష్టి ఆయనలోని భారతీయ సంస్కృతి అవగాహనకు నిదర్శనం. భక్తి ఆయనకు జీవితం నుంచి పారిపోవడానికి మార్గం కాదు; జీవితాన్ని మరింత ఉన్నతంగా చూడడానికి ఒక దృష్టికోణం.

అందుకే ఆచార్య లక్ష్మణ మూర్తి గారిని ఒకే నిర్వచనంలో బంధించడం సాధ్యం కాదు. ఆయన ఆచార్యుడు, పరిశోధకుడు, వక్త, కవి, తాత్త్వికుడు, ఆధ్యాత్మిక చింతకుడు... అన్నింటికంటే మించి ఒక మానవీయ గురువు. జ్ఞానం ఎంత పెరిగితే వినయం అంత పెరగాలని ఆయన జీవితం మనకు నేర్పుతుంది. పాండిత్యం మనిషిని ఇతరుల కంటే ఎత్తులో నిలబెట్టడానికి కాదు. ఇతరులను కూడా పైకి తీసుకెళ్లడానికి ఉపయోగపడాలని ఆయన ఆచరణ చెబుతుంది.

ఒక మహనీయుని మరణం ఆయన శరీరానికి మాత్రమే ముగింపు. ఆయన ఆలోచనలు, ఆయన బోధనలు, ఆయన రచనలు, ఆయన పలికిన మాటలు, ఆయన ప్రోత్సహించిన శిష్యులు...ఇవన్నీ ఆయన జీవితం కొనసాగించే మార్గాలు. ఆచార్య లక్ష్మణ మూర్తి గారి విషయంలో ఈ మాట మరింత సత్యం. ఆయనను కలిసినవారి జ్ఞాపకాలలో, ఆయన బోధించిన విద్యార్థుల ఆలోచనల్లో, ఆయన రచనలు చదివే తరాల మనస్సుల్లో ఆయన నిరంతరం జీవిస్తూనే ఉంటారు.

ఆయనను స్మరించుకోవడం అంటే కేవలం ఒక గొప్ప పండితుడిని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు. జ్ఞానానికి వినయం తోడైతే అది ఎంత గొప్ప మానవశక్తిగా మారుతుందో గుర్తుచేసుకోవడం. పాండిత్యానికి మానవత్వం కలిస్తే ఒక గురువు ఎలా మహనీయుడవుతాడో తెలుసుకోవడం. సాహిత్యం భక్తిని మాత్రమే కాదు, మనిషి అంతరంగాన్ని కూడా శుద్ధి చేయగలదని అర్థం చేసుకోవడం.

ఆచార్య లక్ష్మణ మూర్తి గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన జ్ఞానదీపం ఆరిపోలేదు. ఆయన విద్యార్థులలో అది వెలుగుతోంది. ఆయన అభిమానుల హృదయాలలో అది వెలుగుతోంది. ఆయన రచనల్లో అది వెలుగుతోంది. ఆ వెలుగు మరిన్ని తరాలకు చేరాలి. ఆయన ఆశీస్సులు ఆయన శిష్యులపై, అభిమానులపై, ఆయనను స్మరించే ప్రతి జిజ్ఞాసువుపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ...ఆ మహనీయ ఆచార్యునికి వినమ్ర నివాళి.

# ఆత్మవిశ్వాసం చివరి అంచు!

15 ఏళ్లకే జీవితం నరకప్రాయం

తోడు లేనిదే ఏ పని చెయ్యలేదు

అరుదైన వ్యాధితో చెదిరిన స్వప్నం

పట్టుదలతో జీవితాన్ని జయిస్తున్న స్వప్న



నిమ్మల శ్రీనివాస్

**అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి:**

అవయవాలు అన్నీ సక్రమంగా ఉన్నా, అవిటి ఆలోచనలతో జీవితాలను ఆగం చేసుకుంటున్న వారికి ఆమె ఒక పాఠం. చిన్న సమస్యకి పారిపోతున్న యువతరానికి ఆమె ధైర్యం ఒక అసామాన్యం. విధి రాసిన వ్యాధితో బాధపడుతూ, ఆత్మవిశ్వాసం కోల్పోని పట్టుదలతో పోరాడుతున్న యువతి ఆమె. కేవలం పదిహేనేళ్ల వయసులోనే స్వప్నకు వచ్చిన అరుదైన వ్యాధి ఆమె ఆశయాలను ఛిద్రం చేసి కాళ్ళు, చేతులు పనిచేయకున్నా, వచ్చిన వ్యాధి ఆమె ఆత్మవిశ్వాసాన్ని మాత్రం ఏమీ చేయలేకపోయింది.

**చెదిరిన స్వప్నం**

గోదావరి ఖని కి చెందిన తల్లిదండ్రులు దామోదర్, కోమల దంపతుల ముద్దుల కూతురు స్వప్న. చదువులో ఎంతో చురుకుగా ఉండేది. అందరి అమ్మాయిల్లా తను కూడా జీవితంలో ఏదైనా సాధించాలి అనే కలలు కన్నది. 2011 లో ఇంటర్ చదువుతున్న సమయంలో మెడ నొప్పితో బాధ పడింది. నొప్పి తీవ్రత ఎక్కువ కావడంతో డాక్టర్ ను సంప్రదించారు. అన్ని రకాల టెస్టులు చేసి మెడ దగ్గర నరాల సమస్య ఉందని చెప్పారు. ట్రాన్స్వర్ మైలైటీస్ అనే అరుదైన వ్యాధితో స్పైనల్ కార్డ్ ( వెన్నెముక) దెబ్బతిన్నది అని,

దీని కారణంగా అవయవాలు పనిచేయక పోవచ్చు అని డాక్టర్లు చెప్పారు. వెంటనే చికిత్స ప్రారంభించారు. అయినా కొద్ది రోజుల లోనే కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి. ఒక్కసారిగా తన ప్రపంచం మొత్తం మారిపోయింది. అతి తక్కువ మందికి వచ్చే ఈ వ్యాధి ఆమెకే రావడం విధి రాసిన సత్యం. ఎంతో చలాకీగా ఉండే స్వప్న వీల్ చైర్ కే పరిమితం అయ్యింది. తన కలలు అన్నీ చెదిరి, రెక్కలు తెగిన స్వప్నాలుగానే మిగిలిపోయాయి. అయినా ఆత్మవిశ్వాసం వీడక స్వంతంగా జీవన పోరాటంలో చక్రాలను కదిలిస్తూనే ఉంది.

**తల్లిదండ్రులే ఆమెకు కొండంత అండ...**

కూతురు పరిస్థితికి ఏ తల్లిదండ్రులు అయినా కన్నీళ్ళు పెట్టాల్సిందే. స్వప్న తల్లిదండ్రులు ఆమె చికిత్స కోసం చెయ్యని ప్రయత్నం లేదు. తండ్రి దామోదర్ బిజినెస్ లో ఉండడం వల్ల తన ఆస్తులు అన్నీ కరిగించి స్వప్న వైద్యానికి ఖర్చు చేశారు. కేరళ, ముంబయి లో అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. సుమారు రెండు కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితం రాలేదు. ఇప్పుడు కేవలం ఒక చెయ్యి పని చేస్తున్నది. రెండవ చెయ్యి పాక్షికంగా పని చేస్తున్నది. ఇప్పుడు దామోదర్ కూతురు సంరక్షణ బాధ్యతలు మాత్రమే చూస్తూ ఉన్నారు.

**బతుకు పోరాటం...**

తన చికిత్స కోసం తండ్రి ఆస్తులు అన్నీ పోయాయి. ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితి పాతాళానికి చేరింది. అయినా ఎవరినీ చేయి చాచి అడగ కూడదు అని అనుకున్నారు. తాను రోజు వాడే మెడిసిన్ కోసం చాలా ఖర్చు అవుతుంది. ధైర్యం తెచ్చుకొని, స్వప్న తల్లిదండ్రులతో కలిసి కంప్యూటర్ డిజైన్ లతో చిన్నగా బిజినెస్ చేస్తూ అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నది. తను ట్రీట్మెంట్ తీసుకుంటూనే ఓపెన్ డిగ్రీ పూర్తి చేసింది. నొప్పితో నిద్ర లేని రాత్రులు సహజం. అయినా ఇంట్లో ఉండి కంప్యూటర్ నేర్చుకుంది. డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యం సాధించింది. కంప్యూటర్ డిజైన్ లతో కీ చైన్లు, ఫ్రిజ్ మాగ్నెట్లు, ఈవెంట్స్ రిటర్న్ గిఫ్టులు తయారు చేస్తున్నది. ఆన్ లైన్ ద్వారా వన్ గ్రామ్ గోల్డ్ బిజినెస్ చేస్తున్నది.

**పరిస్థితులే మారేలా చేశాయి...**

**-నేరెళ్ల సౌమ్య**

చిన్న వయసులోనే పెద్ద బాధలు మోయ్యాల్సి వచ్చింది. నా పరిస్థితి నాకు తెలుసు. ఆర్థికంగా అన్నీ కోల్పోయాము. అడ్వాన్స్ ట్రీట్మెంట్ చేస్తే కొంత మెరుగు అవుతుంది. దానికి చాలా ఖర్చు అవుతుంది. ఇప్పటికే నా మెడిసిన్ కోసం ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు అని అనుకున్నాను. చిన్నగా బిజినెస్ చేస్తున్నా. నా తల్లిదండ్రులు నాకు అండగా ఉన్నారు. అందుకే నాకు ఇంకా జీవితం మీద హోప్ ఉంది, కాబట్టి నా కోసం నేను పోరాడుతున్నాను.

**సౌమ్యను ప్రోత్సహిద్దాం రండి...**

**- నిమ్మల శ్రీనివాస్, సామాజికవేత్త**

నాకు ఎవరి ఆర్థిక సహాయం వద్దు... నా దగ్గరకు వచ్చి మీ ఫోటోలతో నేను ఐదు నిమిషాలలో తయారు చేసే ఇచ్చే ఒక కీచైన్, ఒక ఫ్రిడ్జ్ స్టిక్కర్ కొనండి, అంతే చాలు" అన్న సౌమ్య మాటలు నన్ను ఎంతో కదిలించాయి. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో జరుగుతున్న ఎగ్జిబిషన్‌లో సౌమ్య ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించండి. తాను తయారు చేసే మీకు నచ్చిన వస్తువును కొనండి. అది కేవలం ఒక కీచైన్ కొనడం కాదు... ఒక అమ్మాయి ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి మీరు ఇచ్చే చేయూత. (మీ ఫంక్షన్లలో ఇచ్చే రిటర్న్ గిఫ్ట్స్ కూడా మీ ఆర్డర్ పై తయారు చేస్తుంది. వివరాలకు 9491761486).











Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.